

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

నల్గొండ
యాదాద్రి
సూర్యాపేట

గురువారం 26 ఫిబ్రవరి 2026 పేజీలు 8


# డ్రగ్స్ నివారణకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి



**నల్గొండ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్:** డ్రగ్స్ నివారణకు జిల్లాలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.బుధవారం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన "మత్తు పదార్థాల నియంత్రణ జిల్లా స్థాయి కమిటీ" సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలను వినియోగించి జీవితం పాడు చేసుకోకుండా అన్ని శాఖల అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, హాస్టల్ల వద్ద మత్తు పదార్థాలు అమ్మకుండా చూడాలని, తల్లిదండ్రులు, టీచర్ల సమావేశంలో అవగాహన కల్పించాలని, పాఠశాలలు, హాస్టళ్ల బయట షాపులలో మత్తు పదార్థాలు అమ్మకుండా చూడాలని, ఈ విషయంలో సరైన విధంగా కౌన్సిలింగ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల హాస్టల్ అధికారులు వారి పరిధిలోని అన్ని పాఠశాలలు సందర్శించి విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. అన్ని పాఠశాలలు, హాస్టల్ల వద్ద మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించే ఫ్లెక్సీ బ్యానర్లు ఏర్పాటు చేయా లన్నారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఇంటర్ స్టేట్ బార్డర్ చెక్ ఫోస్టులు ఉన్నప్పటికీ నెట్ వర్క్ ఫెసిలిటీని పెంచుకొని జిల్లాలో గాంజా వంటివి ఉత్పత్తి, రవాణా లేకుండా చేయాలని, ఈ అంశంపై పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో మాదకద్రవ్యాల డి- అడిక్షన్ సెంటర్ ను 15 రోజుల్లో ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. నశా ముక్త్ భారత్ కింద అవగాహన కార్యక్రమాలు పెంచాలని, ఎన్జీవోల సహకారంతో మత్తుమందులు తీసుకునే వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలని, మున్సిపాలిటీలలో డిజిటల్ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. (మిగతావార్త 2వ పేజీలో )

## సమాజసేవలో ఎన్జీవోలు ముందుండాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట కలెక్టరేట్, మేజర్ న్యూస్:** సమాజసేవలో ప్రతీఒక్కరు ముందుండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. డాక్టర్స్ ఫర్ యు ఎన్జీవో సహకారంతో హెచ్సిఎల్ ఫౌండేషన్ విరాళంగా ఇచ్చిన అత్యాధునిక వైద్య పరికరాలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూర్యాపేటలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనరల్ హాస్పిటల్ కు అత్యాధునిక పరికరాలు అందించిన హెచ్సిఎల్ వారికి కృతజ్ఞతలు తెలుపుతూ వారు డొనేట్ చేసిన అత్యాధునిక వైద్య పరికరాలు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పరికరాలు రోగి సంరక్షణ మరియు కార్యాచరణ సామర్థ్యాన్ని బాగా పెంచుతాయని ప్రస్తుత రోజుల్లో ప్రైవేట్ వైద్యశాలలో వైద్యం చేయించుకోలేని పేదవారికి ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యధిక వైద్య పరికరాలు సమకూర్చుకోవడం వలన పేదవారికి వైద్యభారం తగ్గుతుందని తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్స్ లో కూడ ప్రైవేటు హాస్పిటల్స్ కు దీటుగా వైద్యం లభిస్తుందనే నమ్మకం ప్రతి పేదవాడికి కలుగుతుందని తెలిపారు. దీనివల్ల సుదూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోలేని పేదలకు ఎంతగానో ఉపయోగపడతాయని. హెచ్సిఎల్ వారి ఆలోచన వెనుకబడిన ప్రాంతా లలో ఆరోగ్య సంరక్షణ పట్ల నిబద్ధతను,ప్రజారోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ఉపయోగపడతాయని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల అదనపు డిఎంఈ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. జయలత, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అదనపు డిఎంఈ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. శ్రావణ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ హెచ్ సీఎల్ ఫౌండేషన్ అసోసియేట్ డైరెక్టర్ సీమి సూరి,డాక్టర్ చేతన తీర్థహళ్లి, డాక్టర్ ప్రవీణ్ కుమార్ గుప్తా పాల్గొన్నారు.

## రబీ ధాన్యం సేకరణకు ముందస్తు ఏర్పాట్లు చేయాలి

### రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్



**నల్గొండ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్:** 2025-26 రబీ ధాన్యం సేకరణకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అయన తనచాంబర్లో 2025- 26 రబీ ధాన్యం సేకరణ పై సంబంధిత శాఖల అధికారులు ,రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు.జిల్లాలో 2025-26 రబీ సీజన్‌లో సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని, రబి ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. రబీ సీజన్‌లో ధాన్యం అంచనా ఉత్పత్తిని దృష్టిలో ఉంచుకుని (మిగతావార్త 2వ పేజీలో )

## పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

### పరీక్షలకు హాజరుకానున్న19, 835 మంది విద్యార్థులు ..109 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

### జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**నల్గొండ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్:** జిల్లాలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పదవ తరగతి పరీక్షలపై చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ డిపార్ట్మెంట్ ఆఫీసర్లు,ప్రధానోపాధ్యాయులకు ఉద్దేశించి నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సంవత్సరం జిల్లాలో 19,835 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, ఇందుకు106 రెగ్యులర్, 3 ప్రయివేట్ మొత్తం 109 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రతి సెంటర్‌లో సిబ్బంది నియామకం, స్పెషల్ స్క్వాడ్ ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేయాలన్నారు.ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు, పరీక్షా కేంద్రాలలోకి అనుమతించరాదని,అన్ని పరీక్ష కేంద్రాలలో లైటింగ్, ఫ్యాన్లు, బెంచ్ లు ఏర్పాటు చేసుకోవాలని,విద్యార్థులకు తాగునీటి సదుపాయం, మూత్రశాలల సౌకర్యం కల్పించాలని,ప్రతి కేంద్రంలో మెడికల్ క్యాంపులు ఉండాలన్నారు.ఎవరైనా ప్రైవేట్ పాఠశాలలు హాల్ టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తే, 



సంబంధిత పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదవ తరగతి పరీక్షల సందర్భంగా డీఈఓ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షల రోజుపరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయడం జరుగుతుందని, సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ చట్టం అమలు చేయనున్నట్లు చెప్పారు. తహశీల్దార్లు, మున్సిపల్ అధికారులు కలిసి పరీక్షా కేంద్రాలను సందర్శించి తనిఖీలు చేయాలన్నారు. సీఎస్, డీవోలకు అందించిన మాన్యువల్ ప్రకారం విధులు నిర్వర్తించాలని అన్నారు.విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించడమే అందరి బాధ్యత అని కలెక్టర్ చెప్పారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు.జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి , జడ్పీ సీఈవో శ్రీనివాసరావు లు ఉన్నారు.

## శోభనాద్రిగూడెంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



చింతలపాలెం, మేజర్ న్యూస్ : చింతలపాలెం మండలం శోభనాద్రిగూడెం గ్రామంలో బుధవారం రోజున నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి, గ్రామ సర్పంచ్ అమెర విజయలక్ష్మి వెంకటేశ్వర్లు. ఈ సందర్భంగా నందిరెడ్డి ఇంద్రారెడ్డి మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో రూ.5 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూ రయ్యాయని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, అభివృద్ధి పనులు కొనసాగుతాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించే దిశగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ సూరంశెట్టి ధనలక్ష్మి హనుమంతరావు, కన్నా హను మంతరావు, కేతిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మేడిశెట్టి హనుమంతరావు, సూర్యంశెట్టి రామకృష్ణ, బొప్పిడి ఇన్నయ్య, కాటిబోయిన నాగమణి, తోట హరీష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా విక్రయించిన ఇద్దరు అరెస్టు

## ప్రభుత్వ ఖజానాకు రూ.43 కోట్ల నష్టం..

### జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవార్




**నల్గొండ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్:** ప్రభుత్వానికి చెందిన ధాన్యాన్ని అక్రమంగా విక్రయించి సుమారు రూ. 43 కోట్ల మేర నష్టం కలిగించిన ఇద్దరు నిందితులను నల్గొండ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడారు. నల్గొండ మండలంలోని దోమల పెల్లి గ్రామ శివారులో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అరెస్టు అయిన వారిలో కందుకూరి మహేందర్ నల్గొండ రవీంద్ర నగర్ నివాసి, కందుకూరి పద్మ భర్త మహేందర్ నల్గొండ రవీంద్రనాథ్ వరకు చెందిన వారిని అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. మా శెట్టి రాధాకృష్ణ, మేడం కృష్ణమూర్తి, ఇడుపుల దామోదర్, కందుకూరి రవికుమార్, బూరుగు బాలకృష్ణ లు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. నిందితుల నుండి ఒక లక్ష తొమ్మిది వేల నగదు, మూడు సెల్ ఫోన్లు, బొలెరో కారును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులు 20 22-20 23 రవి సీజన్లో నిందితులు నల్గొండ పరిసర ప్రాంతాల్లోని సుమాంజలి ఫార్వార్డ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్జాలబావి, వరలక్ష్మి పారువాయిడ్ మిల్ చిట్యాల, మనోహర ఆగ్రో ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, మునుగోడు ప్రభుత్వానికి కష్టం మిల్లింగ్ ఒప్పందం కుదుర్చుకున్నారు. వీరిలో కందుకూరి మహేందర్ ప్రధాన పాత్రధారిగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఏజెంట్ మర్చంట్ గా రైతుల నుండి కనీస మద్దతు ధర కొనుగోలు చేసిన ప్యాడ్ కి సరిపడా బియ్యాన్ని ప్రభుత్వానికి అందించకుండా కుట్ర పూరితంగా ధాన్యాన్ని అక్రమంగా విక్రయించారు. ఈ మూడు రైస్ మిల్లుల ద్వారా మొత్తం 13,170,061 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ దానాన్ని అక్రమంగా విక్రయించి సుమారు 43 కోట్ల నష్టం కలిగించినట్లు విచార ణలో వెల్లడైనట్లు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు వివరించారు. ఈ కేసును నల్గొండ డీఎస్పీ కొలను. శివరాం రెడ్డి పర్యవేక్షణలో దర్యాప్తులో పాల్గొన్న నల్గొండ టూ టౌన్ సిఐ రాఘవరావు, నార్కట్ పల్లి సిఐ నాగరాజు, నల్గొండ రూరల్ ఎస్సై సైదా బాబు లను జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా వారిని అభినందించారు.

## ఆహార పదార్థాల ఫోర్టిఫికేషన్ పై అవగాహన కార్యక్రమం

### పోషకాహార విలువలు గురించి తెలియజేసిన జిల్లా అధికారులు




**భువనగిరి ప్రతినిధి, మేజర్ న్యూస్:** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆహార పదార్థాల ఫోర్టీఫికేషన్ పై అవగాహన మరియు ప్రోత్సాహ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మిల్లర్ల సంఘం ప్రతినిధులు, అంగన్వాడీ సంఘం అధ్యక్షులు రిటైలర్ దుకాణదారులు, పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మనోహర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలలో పోషకాహార లోపాలను తగ్గించడానికి ఫోర్టిఫైడ్ బియ్యం ఇతర ఆహార పదార్థాల వినియోగం పై వివరించారు. అలాగే జిల్లా సివిల్ సప్లైస్ అధికారి రోజా ప్రభుత్వ పథకాల ద్వారా సరఫరా అయ్యే ఫోర్టిఫైడ్ బియ్యం ప్రయోజనాలను వివరించి, పీడీఎస్ సంక్షేమ హాస్టల్స్ ద్వారా పంపిణీ జరుగుతున్న విధానాన్ని తెలియజేశారు జిల్లా సంక్షేమ అధికారి నర్సింగ్ రావు మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలలు ఇతర సంక్షేమ వసతిగృహాలలో ఫోర్టిఫైడ్ ఆహారం ద్వారా బాలల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు, గెజిటెడ్ ఇన్స్పెక్టర్ అండ్ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ స్వాతిఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఇన్చార్జ్ శివ శంకర్ రెడ్డి ఫోర్టిఫి.కేషన్ అమలు విధానం, నాణ్యత నియంత్రణ చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫోర్టిఫికేషన్ ట్రైనర్ డా. ఆంజనేయలు చాగంటి ఫోర్టిఫికేషన్ యొక్క శాస్త్రీయ ప్రాముఖ్యత, పోషకాహార లోపాల నివారణలో దీని పాత్ర మిల్లర్లు పాటించవలసిన సాంకేతిక మార్గదర్శకాలను తెలిపారు ముఖ్యంగా ఐరన్, ఫోలిక్ యాసిడ్ మరియు విటమిన్ బి12 తో ఫోర్టిఫైడ్ చేసిన బియ్యం వినియోగం వల్ల అనీమియా వంటి సమస్యలను తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా ఫోర్టిఫికేషన్ పై మరింత చైతన్యం పెంపొందించి, ప్రజలకు పోషకాహార భద్రతను అందించడమే ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు

## రెవిన్యూ శాఖలో టైపిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్ల కుటుంబాలను ఆదుకోవాలి

### వారిని యధావిధిగా కొనసాగించాలి

### రాష్ట్ర గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు మందడి ఉపేందర్ రెడ్డి



**భువనగిరి ప్రతినిధి, మేజర్ న్యూస్:** రెవెన్యూశాఖలో జిల్లా పరిపాలన అధికారి, మండల రాజస్వ అధికారి మరియు తహశీల్దార్ కార్యాలయాలలో విధులు నిర్వర్తిస్తున్న టైపిస్ట్ కం. కంప్యూటర్ ఆపరేటర్లు వారికీ యాదవిధిగా విధులు కొనసాగించాలని టైపిస్ట్ కం. కంప్యూటర్ ఆపరేటర్లు లకు “పే స్కేల్”ఇప్పించుటకై బుధవారం సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మెన్ మందడి ఉపేందర్ రెడ్డి కి మరియు గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు సి. జగన్ మోహన్ ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు అనంతరం ఇట్టి విషయమై మందడి ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రం లోని వివిధ జిల్లాలలో పనిచేస్తున్న టైపిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్స్ 632 సేవలు నిలిపి వేస్తూ జారి చేసిన మేమో ను తక్షణమే నిలిపివేసి (632) మందిని యాదవిధిగా కొనసాగిస్తూ,ప్రజావాణి పోర్టల్, రేషన్ కార్డుల జారి, కళ్యాణ లక్ష్మి పథకం,మరియు ప్రభుత్వము ప్రవేశ పెట్టె ఎ పథకం అయిన రెవెన్యూ లో టైపిస్టు కం కంప్యూటర్ ఆపరేటర్లు పాత్ర కీలకంగా ఉంది కాబట్టి వారికి శాశ్వత ఉద్యోగ భద్రతా (పే స్కేల్) కలిపించి న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి, నిరుపేద కుటుంబాలకు చెందిన వారిని ఆదుకోవడం ద్వారా చిన్న చిన్న పిల్లలు ఉన్న కుటుంబాలు రోడ్డున పడకుండా చేసి, వృద్దులైన వారి తల్లితండ్రుల బాగోగులను చూసుకునే విధముగా ఉపాధి కల్పించి నిరుపేద జీవితాలలో వెలుగు నింపలని ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో గెజిటెడ్ అధికారులు సంఘం జిల్లా అధ్యక్షులు సి. జగన్ మోహన్ ప్రసాద్ టీఎన్జీవోఎస్ జిల్లా కోశాధికారి కంచనపల్లి శ్రీకాంత్, ట్రెసా నాయకులు ఆర్. గణేశ్ ప్రసాద్ టైపిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## డ్రగ్స్ నివారణకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

అన్ని శాఖలసమన్వయం ,సహకారంతో విద్యార్థులు, పాఠశాలలు, విద్యా సంస్థల పరిసరాలపై గట్టి నిఘా ఉంచి డ్రగ్స్ మహమ్మారిని జిల్లా నుండి తరిమికొట్టాలని, మానస పోర్టల్ పై విస్తృత ప్రచారం కల్పించాలని పిలుపునిచ్చారు .జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా దాడులు నిర్వహించడమే కాకుండా, మత్తుపదార్థాలు వినియోగించే వారికి కౌన్సిలింగ్ చేయడం, కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. 2024లో 400 మందికి,2025లో 450 మందికి కౌన్సిలింగ్ నిర్వహించామని, చిట్యాల లో ఉన్న డ్రగ్ డి- ఎడిక్షన్ సెంటర్ సరిపోనందున జిల్లా కేంద్రంలో మరో డ్రగ్ డి- అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో గాంజా సాగు లేనప్పటికీ ఇతర ప్రాంతాల నుండి మత్తు పదార్థాలు వచ్చేవని,ఇటీవల అవి కూడా తగ్గిపోయాయని తెలిపారు. విద్యాశాఖ తరపున అన్ని పాఠశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక కమిటీలను ఏర్పాటు చేయాలని, విద్యార్థులు ఆన్లైన్ ద్వారాఈ-సిగరెట్స్ వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ,వీటిపై పెద్ద ఎత్తున అవగాహన తీసుకురావాలని, టీచర్లు, తల్లిదండ్రుల సమావేశాల్లో ఈ- సిగరెట్స్ పై చర్చించాలని తెలిపారు. కొన్ని మందుల దుకాణాలలో మత్తుమందుల ట్యాబ్లెట్స్ వాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ అంశంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఈ విషయం తమ దృష్టికి తీసుకువస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ ,బీసీ సంక్షేమ శాఖల అధికారులు, ఎక్సైజ్ , మెడికల్ అండ్ హెల్త్, జిల్లా సంక్షేమ, విద్య, తదితర శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## రబీ ధాన్యం సేకరణకు.. ముందస్తు ఏర్పాట్లు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, గన్నీ బ్యాగుల సమీకరణ, తూకం పరికరాలు, తేమ కొలిచే యంత్రాలు, మిల్లర్లతో సమన్వయం వంటి అంశాలలో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు .ధాన్యం కొనుగోళ్లలో ఎక్కడా ఇబ్బంది పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, గన్నీ బ్యాగులు, హమాలీలు, లారీలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. అవసరమైతే రబీ సీజన్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెంచాలని, రైతులకు సమీపంలోనే సౌకర్యాలు కల్పించాలని, తగినన్ని గన్నీ బ్యాగులు ముందుగానే నిల్వ చేయాలని,గన్నీ బ్యాగుల కొరత రాకుండా రాష్ట్ర స్థాయి నుంచి సరఫరా కోరడం,హమాలీల కొరత లేకుండా తగిన సంఖ్యలో కార్మికులను సిద్ధంగా ఉంచడం,ధాన్యం రవాణాకు అవసరమైన లారీలను ముందుగానే గుర్తించి ఒప్పందాలు చేసుకోవడం ముందే పూర్తి చేయాలని చెప్పారు. తేమ శాతం ప్రమాణాలు పాటిస్తూ పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించడం, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, టెంట్లు, టాయిలెట్ సౌకర్యాలు ఏర్పాటు చేయడం, అకాల వర్షాలకు ధాన్యం తడవడం, పాడు కాకుండా చూడడం చేయాలన్నారు. పౌరసర ఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశానికి హాజరైన నల్గొండ జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు నారాయణ, మిర్యాలగూడ రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ రైస్ మిల్లర్ల తరఫున 2025-26 రబీ సీజన్ ధాన్యం సేకరణను ప్రభుత్వానికి సహకరిస్తామని చెప్పారు . డి ఆర్ డి ఓ వై. శేఖర్ రెడ్డి, పౌరసరఫరాల జిల్లా అధికారి వెంకటేశం, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ రామ్ పతి నాయక్, మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి, బిసిఓ పద్య నాయక్ లీగల్ మెట్రోలాజికల్ అధికారులు శ్రీనివాస్, ఆర్టీవో అధికారులు, పౌర సరఫరాల ఎన్ఫోర్స్మెంట్ డీటీలు , తదితరులు ఉన్నారు.

## బుచ్చమ్మకు నివాళులర్పించిన బిఆర్ఎస్ నాయకులు



**వలిగొండ, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కంచనపల్లి మాజీ సర్పంచ్ గంగారం రమేష్ తల్లి గంగారం బుచ్చమ్మ మృతి చెందింది బుధవారం బీఆర్ఎస్ నాయకులు బుచ్చమ్మ మృతుదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి మాజీ అధ్యక్షులు డేగల పాండు యాదవ్ మాజీ జడ్పీటీసీ మొగుళ్ళ శ్రీనివాస్సర్పంచులు ఆవుల నర్సింహా బోడిగే లింగస్వామీ మొటే జంగమ్మ లింగస్వామి మాజీ ఎంపీటీసీ పల్సం రమేష్ నాయకులు కోమిరెల్లి బాల కృష్ణా రెడ్డి నర్సింహా మహేష్ సత్యనారాయణ నరేశ్ రెడ్డి పాల్గొన్నారు

# మాడ్గులపల్లిలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత మహాఉద్యమం

**డ్రైవర్ లకు ఉచిత కంటి వైద్య సేవలు, కళ్ళజోళ్ల పంపిణి**
**విలేకరులకు హెల్మెట్ లు పంపిణీ:జిల్లా ఎస్ పి శరత్ చంద్రపవర్**

**మాడ్గులపల్లి ,మేజర్ న్యూస్:**పోలీస్ శాఖఆధ్వర్యంలో బుధవారం మాడ్గులపల్లి మండల కేంద్రంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా లారీ డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి కళ్ళజోళ్ళు పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్ పి శరత్ చంద్ర పవర్ ముఖ్య అతిథి గా హాజరై రోడ్డు భద్రత నివారణ చర్యల గురించి మాట్లాడారు. జీవితంలో క్రమశిక్షణ ఉంటే ఉన్నత స్థానాలకు చేరుతారని రోడ్డు పై క్రమశిక్షణ ఉంటే సురక్షితంగా గమ్యానికి చేరుతారన్నారు.రోడ్డుపై ప్రయాణం చేసే ప్రతి వాహనదారుడు బాధ్యతగా ఉండాలని,రోడ్డు భద్రత పట్ల అవగాహన కల్పించ డంలో, రోడ్డుప్రమాదాలునివారించడంలో ప్రతి ఒక్కరు ఆదర్శంగా, ప్రచారకర్తలుగాఉండాలన్నారు. మానవ తప్పిదాల వల్ల అధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవించి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఏ ఒక్కరూ రోడ్డు ప్రమాదంలో ప్రాణం కోల్పోకూడదు అనేది పోలీస్ శాఖలక్ష్య మనిఅయన తెలిపారు. ప్రయాణసమయం లో ముందస్తు జాగ్రత్తలతో సురక్షిత గమ్యం సాధ్యం అవుతుందన్నారు, డిఫెన్సివ్ డ్రైవింగ్ చేయాలి, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపవద్దని , మైనర్ డ్రైవింగ్ తో మీకు ఎదుటి వారికి ప్రమాదంసంభవిస్తుందన్నారు. రోడ్డుకు లెఫ్ట్ సైడ్ డ్రైవింగ్ ఆల్ వేస్ రైట్ అని అయన తెలిపారు. మనం క్షేమంగా ఉంటేనే అనుకున్న లక్ష్యాలు సాధిస్తాం. రోడ్డు ప్రమాదాల్లో వికలాంగులు అయితే జీవితం వ్యర్థం అవుతుందని ,లక్ష్యం ఆవిరౌతుందని,ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో వాహనం నడిపే ప్రతి ఒక్కరు వెనక కూర్చుని ఉన్న వ్యక్తులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు, కార్లు పెద్ద వాహనాలలో ప్రయాణించే వ్యక్తులు తప్పనిసరిగా సీటు బెల్ట్ పెట్టుకోవాలని కోరారు. మైనస్ డ్రైవింగ్ చేయడం వల్ల వాహనంనడిపేవారుఇతరులు ప్రమాదం లోపడతారన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపకూడదనిఎస్ పి సూచించారు. అతివేగంగా వాహనాల నడపడం ప్రమాదమని, ప్రతివాహనానికి అన్ని అనుమతి పత్రాలుకలిగి ఉండాలని వాహనదారుడు లైసెన్స్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో



క్షతగాత్రులకు సహాయ సహకారులు అందించడం గోల్డెన్ ఆవర్ ను సద్వినియో గంచేయాలన్నారు.త్వరితగతిన ఆసుపత్రులకు చేర్చడం వల్ల క్షతగాత్రుల ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. రోడ్డు ప్రమాదాలలో గాయపడ్డ క్షతగత్రులను బాధ్యతగా సహాయ సహకారాలు అందించి ప్రాణాలు కాపీడితే రహదారి హీరోగా కీర్తించి నగదు ప్రోత్సాహకం అందించడం జరుగుతుంది అన్నారు.హెల్మెట్ లేకపోతే రహదారులపైకి ద్విచక్ర వాహనాలుఅనుమతించవద్దని,డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే వాహనం సీజ్ చేస్తామని అయన హెచ్చరించారు. యువతనిర్లక్తంగాఉండవద్దని , సమాజానికి ఆదర్శంగా ఉండాలని ఎస్ పి కోరారు.

**జర్నలిస్టులకు హెల్మెట్ లు పంపిణి చేసిన ఎస్ పి..**

మాడ్గులపల్లి స్థానిక ఎస్ ఐ క్రిష్ణయ్య సహకారం తో మండ లంలో వివిధ పత్రికలలో పని చేస్తున్న ప్రింట్ మీడియా జర్నలిస్టులకు అందించిన హెల్మెట్లను జిల్లా ఎస్ పి శరత్ చంద్ర పవర్ చేతుల మీదగా పంపిణి చేశారు. ఈ సందర్భం గా ఎస్ పి మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజ భద్రత్తతో పాటు ప్రయాణ సమయంలో తప్పకుండ హెల్మెట్ లను ధరించాల న్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు పోలీసు శాఖ చేపట్టిన అవగాహన కార్యక్రమాలకు విస్రుత ప్రచారం కల్పించి ప్రజలను చైతన్యం చేస్తున్న మీడియా మిత్రులను ఎస్ పి అభినందించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు, స్థానిక తహశీల్దార్ సరోజ పావని, ఎంపీడీవో వంశీధర్ రూరల్ సీఐ పిఎన్ డి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు అందజేత



**నార్కట్ పల్లి, మేజర్ న్యూస్ :** లయన్స్ క్లబ్ నల్గొండ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ శ్రీ యెదుల్ల అంజి రెడ్డి గారు వారి లైన్స్ క్లబ్ సేవా బృందంతో కలిసి జడ్పీహెచ్ఎస్ నార్కెట్ పల్లి ని సందర్శించి 10వ తరగతి విద్యార్థులకు 55 మందికి పరీక్షకు అవసరమైన ఎగ్జామ్ ప్యాడ్లు, జామెట్రీ బాక్స్ లు, ఒక్కొక్కరికి రెండు పెన్నులు అందజేశారు. అలాగే ఐదు వేల రూపాయల విలువైన క్రీడా సామాగ్రిని, మరో ఐదు వేల రూపాయల విలువచేసే కథల పుస్తకాలను పాఠశాలకు బహుకరించారు. అనంతరం లైన్స్ క్లబ్ నల్గొండ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ వెల్లేద్దుల అంజిరెడ్డి మాట్లాడుతూపదవ తరగతి విద్యార్థులు పరీక్షల ముందు కాలంలో పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉండాలని,ఉదయం ప్రాతఃకాలానే నిద్రలేచి చదువుకోవాలని, చదివిన విషయాలను తిరిగి మననం చేసుకోవాలని, పరీక్షలకు ప్రణాళిక బద్ధంగా తయారు కావాలని తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆశలు నెరవేర్చాలని విద్యార్థులకు చెప్పారు. పరీక్షల్లో ఎక్కువ శాతం మార్కులు పొందడానికి విద్యార్థి పాటించవలసిన మెలకువలను అంజిరెడ్డి ఆయన అన్నారు . పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.రాములు మాట్లాడుతూ పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ బడులను నిలబెట్టడం కోసం అంజి రెడ్డి గారి లాంటి దాతృత్వం కలిగిన వ్యక్తుల సహకారం ఎంతో అవసరమని, అంజి రెడ్డి గారు విద్యార్థులకు అందజేసిన వస్తువులు, వారు విద్యార్థులకు అందజేసిన మోటివేషన్ చాలా అమూల్యమైనవని అందుకు పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నల్గొండ (డైమండ్) ప్రెసిడెంట్ పిచ్చయ్య , సెక్రటరీ యరమాద అశోక్ , చార్టర్ ప్రెసిడెంట్ ఊరుకొండ ప్రభాకర్ రెడ్డి , పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సొంత నిధులతో మట్టి పోపించిన రెండో వార్డ్ కౌన్సిలర్ అన్నపూర్ణ సైదులు



హాలియా, మేజర్ న్యూస్:నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం హాలియా మున్సిపాలిటీ 2వ వార్డు లో రోడ్లు పరిస్థితి అధ్వానంగ ఉండడంతో కాలని వాసులు ఇబ్బంది పడుతున్నారు, ఇట్టి విషయాన్ని లి2వ వార్డు కౌన్సిలర్ అన్నపూర్ణ సైదులు లి దృష్టికి కాలనీ వాసులు తీసుకువెళ్లడం జరిగింది. వెంటనే స్పందించి 2వ వార్డు కౌన్సిలర్ నకిరేకంటి అన్నపూర్ణ – సైదులు సొంత నిధులతో మట్టి పోయించి రోడ్డుకు మరమ్మతులు చేపించడం జరిగింది.ప్రజల సమస్యల పట్ల తక్షణమే స్పందించిన ఆయనను వార్డు ప్రజలు అభినందించారు, రోడ్ల మరమ్మత్తు పూర్తి కావడంతో వాహన దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కుందూరు శ్యాంసుందర్ రెడ్డి, బాబుద్దిన్, మదన్ రెడ్డి, నాగరాజు, కృష్ణ, శేఖర్, సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**హుజూర్ నగర్ టౌన్, మేజర్ న్యూస్:** ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసి, త్వరలో ప్రారంభించుటకు అందుబాటులో తీసుకురావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం హుజూర్ నగర్ లోని రామస్వామి గుట్ట వద్ద ఇందిరమ్మ ఇండ్ల ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ పనులను త్వరలో పూర్తి చేయాలని, అవసరమైతే రాత్రి పగలు కూడా ఎక్కువ మంది పని వారిని తీసుకొని పనులు పూర్తి చేసి ప్రారంభించడానికి సిద్ధపరచాలని బ్లాక్ లో మధ్య గల అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా, మొక్కలు నాటడం, పెయింటింగ్ పనులు, స్ట్రీట్ లైట్స్ మొదలైన అన్ని రకముల పెండింగ్ పనులను పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసగౌడ్, వైస్ చైర్మన్ మల్లికార్జున్, హౌసింగ్ పిడి సిద్ధార్థ, జిల్లా హార్టికల్చర్ అధికారి నాగయ్య, మిషన్ భగీరథ ఇ.ఇ. కరుణాకర్ రెడ్డి, తాసిల్దార్ కవిత తదితరులు పాల్గొన్నారు.

# పసికూన హత్య ఘటనపై తీవ్ర ఆగ్రహం...

**దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలి : కల్లూరి మల్లేశం**



**ఆలేరు,మేజర్ న్యూస్:**నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగిన కుమ్మెర మల్లన్న జాతర సందర్భంగా దళిత,రజక కుటుంబంపై దాడి చేసి రెండు నెలల పసికూన మృతికి కారణమైన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం ఆలేరు పట్టణ కేంద్రంలో కుల దురహం కారానికి నిరసనగా దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.ఈ సందర్భంగా కల్లూరిమల్లేశం మాట్లాడుతూ జాతరకు దైవదర్శనానికివచ్చిన రజక కుటుంబానికి చెందిన గణేష్,మౌనిక దంపతులను గ్రామ సర్పంచ్ తుకారాం రెడ్డి మరియు ఆయన అనుచరులు అడ్డుకొని ఘర్షణకు దిగారని ఆరోపించారు.గణేష్పై దాడి చేసి,వేడుకున్నప్పటికీ కనికరించకుండా వారి కాళ్ల దగ్గర ఉంచిన రెండు నెలల చిన్నారిని కాళ్లతో తన్నడంతో శిశువు మృతి చెందిందని తెలిపారు.ఇంత తీవ్రమైన ఘటన జరిగినప్పటికీ హత్య కేసు నమోదు చేయకుండా కేవలం బిఎన్ఎస్ 194 సెక్షన్ కింద అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేయడం దురదృష్టకరమని,ఇది నిందితులను కాపాడే ప్రయత్నమని ఆరోపించారు.కులదురహంకార హత్యలకు పాల్పడిన వారిపై హత్యానేరం నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ ఇక్బాల్,మండల కార్యదర్శి దూపాటి వెంకటేష్,సీనియర్ నాయకులు మొరిగాడి చంద్రశేఖర్,మొరిగాడి రమేష్,నల్లమాస తులసయ్య, వడ్డేమాని బాలరాజు, గనగాని మల్లేష్,కాసుల నరేష్,భాస్కర్,ఐలయ్య,అశోక్,కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**యాదగిరిగుట్ట,మేజర్ న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్ పాల్గొన్నారు. ముందుగా జయంతి వేడుకల సందర్భంగా బోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించి అనంతరం సమావేశం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు,ఆర్డీవో కృష్ణ రెడ్డి, డీఆర్డీఓ నాగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య సంత్ సేవాలాల్ మహరాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు.బంజరాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ అన్నారు.ఈ వేడుకలలో సర్పంచులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



# మిర్యాలగూడ లో మెడికల్ మాఫియా.. 5 గురు నకిలీ వైద్యుల అరెస్టు



**మిర్యాలగూడ, మేజర్ న్యూస్:** అర్హత లేకున్నాకంటివైద్యుడినని (ఆప్తమలజిస్ట్)చెప్పి వేరొకరి పేరు మీద తానే డాక్టర్ అని చెప్పుకొని ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యం చేస్తు మోసం చేస్తున్న వ్యక్తి, మరో నల్గురిని మిర్యాలగూడ ఒన్ టౌన్ పోలీసు సిబ్బంది అరెస్టు చేసినట్టు మిర్యాలగూడ డి ఎస్పీ కె. రాజశేఖర్ రాజు తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక ఒన్ టౌన్ పోలీసు స్టేషన్ లో జరిగిన విలేఖరుల సమావేశంలో పట్టణంలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వైద్య బృందం ప్రైవేట్ ఆసుపత్రులు తనిఖీ చేసి వెళ్లి అర్హత లేని ఆసుపత్రుల, వైద్యుల నివేదికను సమర్పించారని ఆ నివేదిక ఆధారంగా ఆరుగురు నకిలీలలో ఐదుగురు పజ్జూరి వికాస్ కుమార్, వల్కి శ్రీను, పేమ్మి వెంకటేష్, బణావత్ శివాకొటేశ్వర్రావు, గడ్డం నాగరాజులను అరెస్టు చేసినట్టు తెలిపారు.మిర్యాలగూడ పట్టణం డాక్టర్స్ కాలనీలో బాలాజి మల్టి స్పెషాలిటీ ఆసుపత్రి పక్కన ఖాజా లతీఫుద్దీన్ కమర్షియల్ బిల్డింగ్ లో పజ్జూరి వికాస్ కుమార్ అనే డిగ్రీ డిస్కాంటిన్యు చేసి 2007-2009 వరకు సరోజినీ దేవి కంటి ఆసుపత్రిలో డిప్లమా ఇన్ ఆప్తమాలమిక్ అసిస్టెంట్ (డిఓఎ)కోర్సు చదివాడన్నారు. డిఓఎ కోర్సు అనంతరం హైదరాబాద్ బ్రాన్స్ ఐ క్లినిక్ లో, శ్రీ నేత్రాలయ ఐ ఆసుపత్రిలో ఆప్తమాలిక్ అసిస్టెంట్ గా సుమారు 5 సంవత్సరాల వరకు పనిచేశాడని తదుపరి మిర్యాలగూడ హనుమాన్ ఐ క్లినిక్ లో కూడా ఆప్తమాలిక్ అసిస్టెంట్ గా సుమారు 6 సంవత్సరాల వరకు పనిచేసి అక్కడ పని మానేసి, నేనే ఆప్తమాలజిస్టుగా రోగులకు చికిత్స చేస్తే ఎక్కువ మొత్తంలో డబ్బులు సంపాదించవచ్చని శ్రీ మహాలక్ష్మి కంటి హాస్పిటల్ ను 2021 సంవత్సరంలో స్థాపించాడన్నారు. అప్పటినుడి సదరు వికాస్ కుమార్ తను కేవలం ఆప్తమాలజిస్ట్ వద్ద అసిస్టెంట్ గా వుండే అర్హత మాత్రమే కలిగి వున్న కానీ జనాలకు నమ్మించుటకు ఆసుపత్రిలో స్పెషలిస్ట్ ఆప్తమాలజిస్ట్ ను కన్సల్టెంట్ గా నియమించుకొని అతని పేరు మీద ప్రిస్క్రిప్షన్ ప్రింట్ చేయించి అతనే ఆసుపత్రికి వచ్చి రోగులకు చికిత్స చేస్తున్నట్లు గా నమ్మిచి, ఆసుపత్రి కి వచ్చే అందరికీ నేనే ఆప్తమాలజిస్టునని చికిత్స చేస్తున్న పజ్జూరి వికాస్ కుమార్ హాస్పిటల్ కు మిర్యాలగూడ హౌసింగ్ బోర్డుకు చెందిన బైరెడ్డి పద్మ అనే మహిళ జూన్ 8, 2025న రాగా ఆమె కుడికన్నును పరీక్షించి కుడికంటిలో చుక్క ఉన్నదని, కుడి కన్నుకు సర్జరీ చేయాలని తనే నిర్ణయించి డాక్టర్ ను పిలిపించి, అతనితో అన్ని టెస్ట్ లు అయిపోయినవి సర్జరీ ఖచ్చితంగా చేయాలని చెప్పి, మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయములో సర్జరీ చేయించినాడు. సర్జరీ అనంతరం ఆమె మరుసటి రోజే హాస్పిటల్ కి వచ్చి నా కుడి కన్ను పూర్తిగా కనపడట్లేదని చెప్పగా విషయం సదరు డాక్టర్ కు చెప్పకుండా, తనే ప్రిస్క్రిప్షన్ పై కొన్ని మందులు వ్రాసి ఇచ్చినాడని ఫలితంగా ఆమె కంటి చూపు మందగించినది. పైగా మూడు నెలల క్రితం తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వైద్య బృందం సైతం తనిఖీలు చేసి కొన్ని కంటి ఆసుపత్రులు శ్రీ మహా లక్ష్మి కంటి హాస్పిటల్', శాలిని ఐ ఆసుపత్రి, యశస్వి కంటి ఆసుపత్రి, అన్నపూర్ణ కంటి ఆసుపత్రి, రాఫ ఐ క్లినిక్ లను తనిఖీ చేసి ఆయా ఆసుపత్రులలో పని చేసే వారు ఆప్తమాలజిస్టులు కాదని, వారికి ఆధునిక వైద్యం లేదా నేత్రవైద్యం చేయడానికి ఎలాంటి అర్హతలు లేవని కేసులు పెట్టారన్నారు. ఈ విషయములో మిర్యాలగూడ ఒన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఎం.నాగభూషణ రావు దర్యాప్తు చేసి ఆప్తమాలజిస్టుగా అర్హత లేకున్న వేరొకరి పేరు మీద తానే డాక్టర్ అని చెప్పుకొని ఆసుపత్రి కి వచ్చే రోగులకు వైద్యం చేస్తు మోసం చేస్తున్న సదరు పజ్జూరి వికాస్ కుమార్ ని అరెస్టు చేశామని ఆయన తెలిపారు. నిందితుడు పజ్జూరి వికాస్ కుమార్ డిప్లమా ఇన్ ఆప్తమాలమిక్ అసిస్టెంట్ (డిఓఎ)గ్రామం రావులపెంట వేములపల్లి మండలం అన్నారు. కేసును చేదించి నేరస్తున్ని పట్టుకున్న ఇన్స్పెక్టర్ ఎం.నాగభూషణరావు, ఎస్ఐ. ఎ.సైదిరెడ్డి, హెడ్ కాన్స్టేబుల్ రాజారం, కాన్స్టేబుల్స్ వీర బాబు, నర్సింహ, ప్రసాద్ లను కె.రాజశేఖరరాజు అభినందించారు. సమావేశంలో టూ టౌన్ ఇన్స్పెక్టర్ జె. సోమనర్సయ్య, ఎస్ఐ బి. రాంబాబు ఉన్నారు. నిందితులను స్థానిక జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా జ్యూడిషల్ కస్టడీకి ఆదేశించారు.

# ప్రజలకు మెరుగైన విద్య వైద్య సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**వేములపల్లిమేజర్ న్యూస్** :ప్రజలకుమెరుగైనవిద్య,వైద్యం అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారంవేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్లు గ్రామములో సూర్యాపేట లయన్స్ క్లబ్ సౌజన్యంతో యశోద హాస్పిటల్ డాక్టర్ల బృందం తో ఏర్పాటుచేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ను లయన్స్ క్లబ్ చైర్మన్ మిర్యాల సుధాకర్ తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి పేదవా డిని ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.నిరుపేదలను గుర్తించి సంక్షేమ ఫలాలను అందించడమే రేవంత్ సర్కార్ లక్ష్యమన్నారు. దాతృత్వానికి మిర్యాలసోదరులురాశీమ్మూర్తి,సుధాకర్, వెంకటేశ్వర్లు పెట్టింది పేరుగా నిలిచారని అయన కొనియాడారు.మనం సంపాదించిన సంపదను ఇతరులకు పంచడంలో సంతృప్తిలభిస్తుందన్నారు. మారుమూల ప్రాంతాలలోని పేదలకు వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు వినియోగించుకోవాలని కోరారు.ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ చైర్మన్ మిర్యాల సుధాకర్ మాట్లాడుతూ ఈ ఉచిత మెగా హెల్త్ క్యాంపు లో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చామని పేర్కొన్నారు. మెగా హెల్త్ క్యాంపు గ్రామ ప్రజలువినియోగించుకోవాలని కోరారు.ఏ ఆపద వచ్చిన గ్రామ ప్రజలకు అండగా ఉంటాననిభరోసాకల్పించారు.ఉచిత మెగా హెల్త్ క్యాంపుకు అనూహ్య స్పందన వచ్చిందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అమనగల్లు, లక్ష్మిదేవిగూడెం సర్పంచులు పిల్లల సందీప్, ఎలికంటి భరత్ కుమార్ , ఉపసర్పంచ్ శాలెం రాజు, రామలింగేశ్వర దేవాలయ చైర్మన్ బ్రహ్మదేవర విద్యాసాగర్, లయన్స్ క్లబ్ డిస్టిక్ గవర్నర్ రేపాల మదన్మోహన్, ఐ హాస్పిటల్ చైర్మన్ దోసపాటి గోపాల్, సుధాకర్ పివిసి అధినేత మీలా మహాదేవ్,జిల్లా కోఆర్డినేటర్ గుడిపూడి వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ సభ్యులు మిర్యాల రామ్మూర్తి,వెంకటేశ్వర్లు,కొండ సంతోష్, రాచర్ల కమలాకర్, తోట శ్యామ్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.



# ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



**మిర్యాలగూడ, మేజర్ న్యూస్** :పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ఇంటర్మీడియట్ పరీక్షలు మిర్యాలగూడ పట్టణంలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా బుధవారంప్రారంభమయ్యాయి. మిర్యాలగూడ పట్టణంలోని చర్చి రోడ్డు లోగల కేఎల్ఎన్ జూనియర్ బాలుర కళాశాల, హనుమాన్ పేటలో గల కేఎల్ఎన్ బాలికల (సాకేత) కళాశాల, శ్రీ అరోరా జూనియర్ కళాశాల, సినాప్సి జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాల, మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్ పేట బైపాస్ గాయత్రీ నగర్ వద్ద గల గిరిజన గురుకుల జూనియర్ కళాశాల లో పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు అరగంట, 45 నిమిషాల ముందే చేరుకోవడం తో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాశారు. ఉదయం 8:30 గంటల నుంచి కేంద్రం హాల్లోకి అధికారులు ప్రతి విద్యార్థికి ప్రత్యేకంగా తనిఖీ చేసి పంపించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఇద్దరు పోలీస్ లు, పాటు ప్రాథమిక ఆరోగ్య సిబ్బందిని నియమించారు. గురుకుల జూనియర్ కళాశాలను డిఇసి మెంబర్లు పద్మ, మరో ఇద్దరు రెవెన్యూ పోలీస్ శాఖల అధికారులు తనిఖీ చేశారు. ఆయన వెంట సిట్టింగ్ స్కాడ్ సత్యనారాయణ, సిఎస్ కృష్ణ నాయక్, డివో హరికృష్ణ,లు ఉన్నారు.

# 22వ వార్డు లో వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు

**కోదాడ, మేజర్ న్యూస్:** కోదాడ పట్టణంలో గత రెండు రోజుల క్రితం కురిసిన అకాల భారీ వర్షానికి వాగులు కుంటలు నిండి వరద ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. వెంటనే చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ బాబు ఆధ్వర్యంలో రెండు రోజుల నుండి వర్షపు నీరు సాఫీగా పోయేందుకు వాగులు కాలువల పూడికతీత పనులు పెద్ద ఎత్తున చేపట్టారు. అందులో భాగంగానే చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ బాబు ఆదేశాలతో బుధవారం 22వ వార్డులో మున్సిపల్ అధికారులు, వార్డు కౌన్సిలర్ కృష్ణ తో కలిసి వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు వీలుగా మురుగు కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, పూడికను తొలగించే పనులను ముమ్మరంగా నిర్వహించారు. వర్షపు నీటితో స్థానికంగా నివసించే వారికి ఇబ్బందులు కలగకుండా పనులను చేపట్టి నట్లు వారు తెలిపారు. కాలువల్లో నీరు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని వార్డు ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వారి వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటరత్నం బాబు, కౌన్సిలర్ యలమందల నరసయ్య,గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వీరారెడ్డి, మధు, హనుమంతరావు,ఉస్మాన్, పనింద్ర, సైదులు దేవమణి పాల్గొన్నారు.

# సేవాలాల్ జయంతి ఉత్సవాలు విజయవంతం



**మిర్యాలగూడ,మేజర్ న్యూస్:**నియోజకవర్గంలో కనివిని రీతిలో శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు విజయవంతంగా జరిగాయని అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సహ కమిటీ సభ్యులు నిర్వహణ ఏర్పాట్లు బాగా చేశారని, బంజారా సోదరి సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొనడానికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉత్సవా కమిటీ అధ్యక్షులు కొర్ర నాగు నాయక్ మండల విద్యాధికారి ధర్మానాయక్,రవితేజ,సర్పంచ్లు సిద్దు నాయక్ శ్రీహరి, బాలు,ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ నాయక్, కొర్ర కృష్ణ కాంత్,రాంబాబు,నాయక్ కిషన్ నాయక్, దాస్య నాయక్,వంశి, హుస్సన్,శివ చరణ్,శివ,శంకర్, నాగ పాల్గొన్నారు.

# పుర చైర్మన్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ



**చౌటుప్పల్, మేజర్ న్యూస్:**చౌటుప్పల్ పుర చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మామ స్వామి గౌడ్ ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం వారి కుటుంబాన్ని పరామర్శించి, స్వామి గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఆయన వెంట సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, పుర కార్యదర్శి పగిల్ల మోహన్ రెడ్డి,ఉడత రామలింగం, కొండూరు విప్లవ్, బద్దుల సుధాకర్, రొండి నర్సింహా, రెహమాన్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# వేణుగోపాల స్వామి ఆలయంలో ఘనంగా సుదర్శన హోమం

**నార్కట్ పల్లి, మేజర్ న్యూస్ :** నార్కట్పల్లి మండలం గోపాలపల్లి గుట్టపై వెలసిన శ్రీ వారిజాల వేణుగోపాల స్వామి ఆలయంలో రోహిణి నక్షత్ర బుధవారం సందర్భంగా సుదర్శన హోమం నిర్వహించడం జరిగింది. భక్తులు సాంప్రదాయ దిశలతో దంపతులు హోమంలో పాల్గొనగా వేద పండితులు ఈ క్రతువు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం విచారణ చేశారు. సుదర్శన హోమం లో వేణు ధర్మపత్ని నాగమణి, చంద్రశేఖర్ ధర్మపత్ని సూర్య కళ, శ్రీమన్నారాయణ ధర్మపత్ని రమాదేవి, గుత్తా కృష్ణారెడ్డి ధర్మపత్ని ఆవనిజ, శ్రీనివాసు ధర్మపత్ని శ్రీదేవి హోమంలో పాల్గొన్నారు.

# శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి జాతర వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

## నూతన దక్షిణ మండప నిర్మాణానికి శంకుస్థాపన
## తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి



**చింతపల్లి , మేజర్ న్యూస్:** ప్రతి ఒక్కరు శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు పొందాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల .స్వప్న శేఖర్ రెడ్డి,గ్రామ పాలక వర్గం,గ్రామ ప్రజలు అన్నారు.చింతపల్లి మండలం తీదేడు గ్రామంలోని శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల(జాతర) సందర్భంగా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.శ్రీ రామలింగేశ్వర స్వామి గుట్ట అభివృద్ధి కోసం దేవాలయం వద్ద దక్షిణ మండపం (హాల్) శంకుస్థాపన చేశారు.అనంతరం మాట్లాడుతూ.. వార్షిక బ్రహ్మోత్సవాలను భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు,వాహన సేవలు,అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.వాల్ పోస్టర్‌లో బ్రహ్మోత్సవాల తేదీలు,కార్యక్రమాల వివరాలు,ప్రత్యేక సేవల సమయాలు పొందుపరిచమని తెలిపారు.భక్తులందరు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొంది శ్రీ భవానీ రామలింగేశ్వర బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన. వెంకటయ్య యాదవ్,ఆలయ అర్చకులు సురభి సత్యనారాయణ శర్మ సోదరు లు,మాజీ సర్పంచ్ కాయితి .జితేందర్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్లు ధరణిపతి. రమణారావు,ఉలుపాల .శేఖర్ రెడ్డి, సోనగంటి .గొవర్ధనాచారి, పి.ఏ.సి.యస్ మాజీ డైరెక్టర్ తిరుమణి పాపయ్య,గ్రామ పెద్దలు మగ్రు. రామారావు,మోర కిరణ్,అంకం అంజూర,కొర్వి రాధాకృష్ణ ,తిరుమణి వెంకటయ్య,జూలురి శ్రీధర్,మగ్రు శ్రీనివాసరావు,కాయితి బచ్చిరెడ్డి,మగ్రు .సురెందర్ రావు,జెల్ల .వెంకటేశ్వర్లు,రాశిక .పాండయ్య,నేలపట్ల మురళి,వీరమల్ల వెంకటయ్య,సిమర్ల శ్రీను యాదవ్,బొడ్డు యాదగిరి,రెడ్డి పరమేష్,ఇడమోని శ్రీను యాదవ్,ఉడుత .శంకరయ్య,సివర్ల. శంకర్,మెరిక శంకరయ్య,చింతకుంట్ల. రాకేష్,వలమోని వెంకటయ్య,బొడ్డు. సంతోష్ ,రాశిక శీరీష్,మెండె .మల్లయ్య,సందె. శంకర్,పంబాల. చెన్నయ్య,సందె. బిక్షం,కొన్రెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

# కోదాడలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



**కోదాడ, మేజర్ న్యూస్:** కోదాడ పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే విద్యార్థులు తమ తమ పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ప్రభుత్వం విధించిన ఐదు నిమిషాల గడువుపై అవగాహన ఉండటంతో విద్యార్థులు గడువు సమయానికి ముందే కేంద్రాల వద్దకు చేరుకుని వేచి చూశారు. హాల్ టికెట్లను సరిచూసుకుని, నిబంధనల ప్రకారం పరీక్ష గదుల్లోకి ప్రవేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

# రూఫ్ టాప్ సోలార్ సిస్టం పనులను వేగవంతం చేయాలి

## ఫార్మర్స్ రిజిస్ట్రేషన్‌ను నెలాఖరులోగా పూర్తి చేయాలి:జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్

కనగల్ మేజర్ న్యూస్: నల్గొండ జిల్లాలో పైలెట్ పద్ధతిన ఎంపిక చేసిన గ్రామాల్లో గృహ జ్యోతి లబ్ధిదారులకు అమలు చేస్తున్న రూఫ్ టాప్ సోలార్ సిస్టం ఏర్పాటు పనులను మార్చి మొదటి వారం లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ ఆదేశించారు. బుధవారం ఆయన కనగల్ మండలం లోని కనగల్ గ్రామంలో టీఎస్ రెడ్ కు ఆధ్వర్యంలో గృహ జ్యోతి లబ్ధిదారులకు అమలు చేస్తున్న రోక్టాప్ సోలార్ సిస్టం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 292 మంది గృహజ్యోతి లబ్ధిదారులు ఉండగా వీరికి రూమ్ టాప్ సోలార్ సిస్టం ఏర్పాటు చేసేందుకు పైలట్ పద్ధతిన ఎంపిక చేయడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 81 గ్రామాల్లో ఈ పథకం అమలు చేయనుండగా నల్లగొండ జిల్లాలో మూడు గ్రామాలు ఎందుకు ఎంపిక చేయబడ్డాయి ఈ మూడు గ్రామాల్లోని గృహజ్యోతి లబ్ధిదారుల ఇళ్లపై రెండు కిలోవాట్ల రూఫ్ టాప్ సోలార్ సిస్టమును ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ముందుగా కొంతమంది ఎంపిక చేసిన గృహాలపై సోలార్ సిస్టం ను బిగించామన్నారు. రెండు మూడు రోజుల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే పూర్తయిన వెంటనే గ్రూప్ ఆఫ్ సోలార్ సిస్టం ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కనగల్ గ్రామంలో 77 ఇళ్లపై రుక్టాప్ సోలార్ సిస్టం ఏర్పాటు చేసే పనులు ఇప్పటికే మొదలయ్యాయి అన్నారు. దీంతో వారు 200 లోపు యూనిట్ల విద్యుత్తును వినియోగించుకొని తక్కిన విద్యుత్తును కూడా గ్రేడుకు కు అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. రెండు కిలోవాట్ల రూఫ్ టాప్ సోలార్ సిస్టం ఏర్పాటు చేయడం ద్వారా సుమారు 25 యూనిట్ల వరకు విద్యుత్తు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందన్నారు దీని ద్వారా లబ్ధిదారులకు, అటు ప్రభుత్వానికి రెండు వైపులా మేలు కలిగే ఈ పథకం పైలెట్ పద్ధతిని విజయవంతం అయ్యే అయితే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. మొదటి విడత పైలట్ పద్ధతిని చేపట్టి రోగ్ టాప్ సోలార్ సిస్టం పనులను నల్లగొండ జిల్లాలో త్వరితగతిన పూర్తిచేసే విధంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయ అధికారితో మాట్లాడుతూ ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. కరగల మండలంలో ఇప్పట వరకు కేవలం 47 మాత్రమే ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయడం జరిగిందని, అందువలన రైతులందరూ ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా అవగాహన కల్పించి రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. మండలంలో నూటికి నూరు శాతం రైతులు ఫార్మర్స్ రిజిస్టర్ చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎవరైనా ఇతర ప్రాంతాల్లో ఉన్నట్లయితే సమాచారం అందించి ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా చర్యలు చేపటాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నర్సింగ్ మురళీధర్ గౌడ్ ,రెడ్ కు జిల్లా మేనేజర్ సంతోష్, ట్రాన్స్కో ఏ ఈ  ఆర్ ఎం జె కుమార్, ఎంపీడీవో వేద రక్షిత, తాసిల్దార్ పద్మ, ఏవో అమరేందర్ గౌడ, పంచాయితీ కార్యదర్శి వీరబాబు, ఉప సర్పంచ్ మండలి చంద్రయ్య, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తా

## చైర్‌పర్సన్ కుసుమకు నాయి బ్రాహ్మణ సంఘం సన్మానం



**కోదాడ, మేజర్ న్యూస్:** నాయి బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు హామీ ఇచ్చారు. బుధవారం కోదాడ నాయి బ్రాహ్మణ సేవా సంఘం పట్టణ అధ్యక్షులు ఆలేటి గోపి ఆధ్వర్యంలో నూతనంగా మున్సిపల్ చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన కుసుమా బాబును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల సహకారంతో నాయి బ్రాహ్మణులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని తెలిపారు. వృత్తి పరంగా ఎదురయ్యే కష్టసుఖాల్లో తాను ఎల్లప్పుడూ తోడుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షులు ఆలేటి గోపి, సంఘం పెద్దలు సురభి నరసయ్య, తాడేపల్లి గోవిందరావు, ఆలేటి చిన్న సత్యనారాయణ, మాధవరపు సీతారాములు, ఆలేటి వెలగొండ,ఆలేటి వెంకటే శ్వర్లు, గుడిమల్ల శ్రీహరి,  వినుకొండ శ్రీనివాస్, సన్నాయిల వీరబాబు, తూముల రాంబాబు, కేతవరపు సైదులు,  పిన్నెల్లి మురళి, వెన్నెల శీను, ఆలేటి సహదేవ్ తాడేపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎస్  సునీల్ నాయక్ పై రాజకీయ కక్షసాధింపు చర్యలు ఆపాలి



**దేవరకొండ, మేజర్ న్యూస్:** ఐపీఎస్ సునీల్ నాయక్ పై రాజకీయ కక్షసాధించి చర్యలు ఆపాలని దేవరకొండలో బుధవారం ఒక ప్రకటనలో కేతవత్ బాబురామ్ నాయక్ డిమాండ్ చేశారు అదేవిధంగా ఆయన మాట్లాడుతూవృత్తినే దైవంగా భావించి, అత్యంత నిబద్ధతతో విధి నిర్వహణ చేస్తున్న ప్రభుత్వ అధికారులను రాజకీయ కారణాలతో వేధించడం అప్రజాస్వామికమని రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ  జాతీయ అధ్యక్షుడు కే.బాబురామ్ నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ పై ఆంధ్రప్రదేశ్ పోలీసులు తీసుకున్న చట్ట విరుద్ధ చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు.?ఈ సందర్భంగా బాబురామ్ నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మారిన వెంటనే వ్యక్తిగత కక్షలతో నిజాయితీ గల అధికారులను టార్గెట్ చేయడం దురదృష్టకరమన్నారు. ఎటువంటి ముందస్తు వారెంట్ లేకుండా, అసంపూర్ణ డాక్యుమెంటేషన్‌తో సునీల్ నాయక్ గారిని అరెస్ట్ చేసేందుకు ఏపీ పోలీసులు చేసిన ప్రయత్నాన్ని పాట్నా సివిల్ కోర్టు తిరస్కరించడం న్యాయానికి లభించిన తొలి విజయమని ఆయన అభివర్ణించారు. చట్టాన్ని రక్షించాల్సిన వారే నిబంధనలు ఉల్లంఘించడంపై కోర్టు మొట్టికాయలు వేయడం పోలీసుల అత్యుత్సాహాన్ని ఎండగట్టిందన్నారు.?గోర్ బంజారా జాతి గర్వించదగ్గ బిడ్డ, నిప్పులాంటి నిజాయితీ గల సునీల్ నాయక్‌కి బంజారా సమాజం అంతా వెన్నుదన్నుగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ధర్మం వైపు నిలబడే అధికారుల మనోధైర్యాన్ని దెబ్బతీసే కుట్రలను ప్రజలంతా గమనిస్తున్నారని, న్యాయ వ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని తెలిపారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా అధికారులు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలని, సునీల్ నాయక్ కి తమ సంస్థ,  గిరిజన సంక్షేమ సంఘం తరపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు బాబురామ్ నాయక్ వెల్లడించారు.

# ఇంటర్ పరీక్షలకు 239 మంది విద్యార్థులు హాజరు



**తిరుమలగిరి, మేజర్ న్యూస్ :** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, విద్యార్థులకు వార్షిక పరీక్షలు బుధవారం కట్టుదిట్టమైన వాతావరణంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తిరుమలగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో  పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మృత్యుంజయ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న మోడల్ స్కూల్, కస్తూరిబా పాఠశాల,  ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న మొత్తం 264 మంది విద్యార్థులకు గాను మొదటి రోజు పరీక్షకు 239 మంది హాజరయ్యారని తెలిపారు. 25 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.పరీక్షా కేంద్రాన్ని డీఈసీ భాను నాయక్, మండల తహశీల్దార్ బి. హరిప్రసాద్ సందర్శించి పరిశీలించారు. పరీక్షల కేంద్రంలో విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందికలగకుండా అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

# కుమ్మెర ఘటన కారకులను కఠినంగా శిక్షించాలి

**తిరుమలగిరి, మేజర్ న్యూస్:** తెలంగాణ యావత్ సమాజం తలదిచుకునేలా నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో రజక కులానికి చెందిన కుటుంబం దైవ దర్శనానికి వెళ్ళితే,టికెట్ లేదనే నెపంతో ఆ కుటుంబం పైన దాడి చేసి 2 నెలల పసి కందు మరణానికి కారణమైన అగ్రకుల దుర హంకారులను తక్షణమే అరెస్ట్ చేసి శిక్షించాలని సీ.పి.ఐ (ఎం - ఎల్ )మాస్ లైన్ తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి పేర్ల నాగయ్య డిమాండ్ చేశారు. తిరుమలగిరి లోవిలేకరులతో ఆయన మాట్లాడుతూ దైవదర్శనానికి వెళ్లిన రజక కుటుంబ యజమాని గణేష్ అతని బంధువులతో పాటు ఆడవాళ్లను కూడా విచక్షణ లేకుండా బూతులు తిట్టి గదిలో వేసి బంధించి అత్యంత పాషవికంగా దాడి చేసి,అనాగరిక చర్యలకు పాల్పడిన దుండగులు 2 నెలల పాపను కాళ్లపై వేసిన కనికరించకుండా అత్యంత పాశ వికంగా కాళ్లతో తన్ని ఆ పసిపాప మరణానికి కారకులైన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అగ్రకుల దృహంకారులను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని కోరారు. అగ్రకుల దురహంకారానికి, అధికారం తోడైతే ఎలాంటి నీచ పరిస్థితి వస్తుందో ఈ ఘటనే ప్రత్యక్ష సాక్ష్యం అని ఆయన అన్నారు. హిందువు లంతా బంధువులని ఇంటి తలుపుల మీద స్టిక్కర్లు వేసుకునే హిందువులారా ఆలోచించండి. అగ్ర కులస్తులు దళితులను వెనుకబడిన జాతీయులను తమలో కలుపుకోరని గ్రహించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని మతోన్మాద ఫాసిస్ట్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మైనారిటీలపై, నిమ్న జాతి కులస్తులపై, దళితులపైఅగ్రకుల అహంకారులు దాడులు పెరిగినాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ లో రెడ్డిలంతా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వయానా బంధువులు అవటం మూలంగానే పోలీసులు అరెస్టు చేయడానికి జంకుతున్నారు అనేది బహిరంగ రహస్యం.నిందితులు



ఎంతటి వారైనా ప్రజాస్వామ్యం ముందు అందరూ సమానమే అన్న వాదనకు కట్టుబడి నిందితులను అరెస్టు చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అత్యంత కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభ్య సమాజానికి తల్లిలాంటి సేవలు అందిస్తున్న రజక కులానికి దేవాలయంలో కూడా రక్షణ కరువైందని దేవాలయం సాక్షిగా రజకుల మీద దాడిచేసిన నిందితులను శిక్షించకపోతే మైలపట్టిన వస్త్రాలనుచాకిరేవు వేసిన చందంగా ప్రభుత్వాన్ని కూడా చాకిరేవు వేయడానికి వెనకాడ బోమని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కుమ్మెర ఘటనకు బాధ్యులైన వారిని శిక్షించేంతవరకు ప్రజలందరూ ఐకమత్యంగా ఉద్యమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కమిటీ సభ్యులు వేరుపుల లక్ష్మన్న, టి యు సి ఐ తుంగతుర్తి డివిజన్ ఉపాధ్య క్షులు మోరగుండ్ల జాను, అరుణోదయ నాయకులు ఈదుల యాదగిరి, నాయకులు ఈదుల రవి, ఈదుల అంజయ్య, బోల్ దాస్ రవి పాల్గొన్నారు.

## పసిబిడ్డ మరణానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి



**గరిడేపల్లి, మేజర్ న్యూస్:**నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో చోటు చేసుకున్న దారుణ ఘటన మీద రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతు న్నాయి కుల వివక్షతో నిరుపేద కుటుంబంపై జరిగిన దాడులు, రెండు నెలల పసిపాప మృతి చెందడం మానవత్వానికి మాయని మచ్చగా నిలిచిందని గరిడేపల్లి మండలం సర్వారం గ్రామ రజక సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామంలో మంగళవారము నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సర్వారం స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం నుండి ర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ మరియు ఇతర బీసీ కుల సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అందరూ ముక్తకంఠంతో జరిగిన దారుణ ఘటన ఖండిస్తూనే దోషులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అధికారులు రాజకీయాలకు తలుగొద్దని తప్పుచేసిన వారు ఎంతటి వారైనా వారిని శిక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు, మహిళలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత..



**నూతనకల్, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని ఎర్రపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 62 మంది విద్యార్థులకు అశోక చక్రవర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు పసుల శైలజ అశోక్ యాదవ్ వివాహ దినోత్సవం సందర్భంగా పరీక్ష సామాగ్రి ప్యాడ్స్,పెన్నులు బుధవారం అందజేశారు. అశోక చక్రవర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అశోక్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకొని ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లితండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు.గత 3 సంవత్సరాలుగా ఈ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్,పెన్నులు,పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల నిమిత్తం రవాణా సదుపాయం కల్పించడం జరుగుతుందనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్తయ్య,ఉపాధ్యాయులు, గ్రామ ఉపసర్పంచ్ మంగళపల్లి నారాయణ,మాజీ సర్పంచ్ గుర్రం సత్యనారాయణ,గ్రామ పెద్దలు లింగాల రామచంద్రయ్య,పసుల లింగయ్య,వార్డ్ నెంబర్లు చిర్ర శ్రీనాథ్,పసుల ఉమాయాదగిరి, పసుల సుధాకర్,మొండికత్తి ఎల్లయ్య,జలగం గౌతమ్,యువ నాయకులు మొండి కత్తి పరశురాములు,మద్దెల మధు, అనంతల విజయ్,వల్లపు మధుసుదన్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



రాజపేట, మేజర్ న్యూస్:రఘునాథపురం గ్రామానికి చెందిన వడ్లకొండ కొండయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను బుధవారం 12వ వార్డు సభ్యులు డొంకెన శైలజ భాస్కర్ పరామర్శించి,బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత,ఆలేరు ఎమ్మెల్యే అయిలయ్య సహకారంతో వారి కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చల్లూరి చిన్న పోశయ్య,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బల్ల మహేష్,డొంకెన బలరాం, కలకుంట్ల సంపత్,చల్లూరి భాను,పుల్లంగాని రాజు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గా రావెళ్ల



**కోదాడ, మేజర్‌న్యూస్:** తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా కోదాడ పట్టణానికి చెందిన రావెళ్ల సీతారామయ్య ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాదు లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక సందర్భంగా సీతారామయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోదాడ యూనిట్ అధ్యక్షుడిగా, జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రావెళ్ల సీతారామయ్య విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేశారు. వారి సేవలను గుర్తించి రాష్ట్ర కార్యవర్గం అసోసియేట్ అధ్యక్షులుగా నియమించినందుకు గాను జిల్లా అధ్యక్షులు బొల్లు రాంబాబు, కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి పందిరి రఘువర ప్రసాద్, వీరబాబు, భ్రమరాంబ,జానయ్య, హాజీ నాయక్,యస్ దాని, భిక్షం, నర సయ్య, శోభారాణి, కార్యవర్గ సభ్యులు, పెన్షనర్లు శుభాకాంక్షలు తెలిపారు.

## కౌన్సిలర్ కృష్ణ గౌడ్‌ను సన్మానించిన పదవతరగతి విద్యార్థులు



హుజూర్ నగర్ రూరల్, మేజర్ న్యూస్ :ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 19 వ వార్డు నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన వల్లపు దాస్ కృష్ణ గౌడ్ ను 1998 పదవతరగతి విద్యార్థులు బుధవారం శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వారు మాట్లాడుతూ కృష్ణ విజయానికి సహకరించిన ముస్లిం మైనార్టీ నాయకులు సైదా మేస్త్రికి, వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో దొంతి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బాల కిరణ్, సుమన్, రఫీ, సైదా, జానీ,పాషా, షఫీ నాగ సైదులు,సైదులు, సంజీవ్ రెడ్డి,భాస్కర్, గురవయ్య, నాగయ్య,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## స్వామివారిని దర్శించుకున్న దానం నాగేందర్



**యాదగిరిగుట్ట, మేజర్ న్యూస్:**యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారు తమ ఇలవేల్పు అని అన్నారు. తరచుగా తాము యాదగిరిగుట్టకు వస్తుంటామని తెలిపారు. యాదగిరిగుట్ట స్వామి వారి ఆలయాన్ని దర్శించుకోవడం ఎంతో ఆనందం కలిగిస్తుందని అన్నారు. స్వామివారి కల్యాణోత్సవం రోజున ఇక్కడికి రావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు వీరికి వేద ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. మల్లాపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు కర్రె వీరయ్య ఉన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



**కట్టంగూర్, మేజర్ న్యూస్:** కట్టంగూర్ మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కమిటీని బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పెరుమాళ్ళ జ్ఞాన ప్రకాష్ రావు సమక్షంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పామనగుండ్ల పంచాయతీ కార్యదర్శి కె పెద్దయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శిగా కట్టంగూరు పంచాయతీ కార్యదర్శి వడ్లకొండ అశోక్, కోశాధికారిగా పరడా పంచాయతీ కార్యదర్శి బి. వెంకన్న, గౌరవ అధ్యక్షులుగా ముత్యాలమ్మ గూడెం పంచాయతీ కార్యదర్శి జి శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా బొల్లేపల్లి పంచాయతీ కార్యదర్శి సరస్వతి, ఐటిపాముల పంచాయతీ కార్యదర్శి జి అనిల్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా మల్లారం పంచాయతీ కార్యదర్శి మన్నెం వెంకటేష్, కార్యనిర్వహక కార్యదర్శిగా మునుకుంట్ల పంచాయతీ కార్యదర్శి ముషం భవాని, ప్రచార కార్యదర్శిగా గార్లబాయి గూడెం పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్, స్పోర్ట్స్ కార్యదర్శిగా రామచంద్రపురం కార్యదర్శి టి సాయి కృష్ణ లతోపాటు కార్యనిర్వాహక సభ్యులుగా శ్రీకాంత్ రెడ్డి శ్రీను యామిని ప్రసన్న లింగస్వామిలను ఎన్నుకున్నారు.

# అంబేద్కర్ భవనానికి మోక్షం ఎప్పుడు..?

**మర్రిగూడ, మేజర్ న్యూస్:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ భవన నిర్మాణం కోసం శివన్నగూడ అంబేద్కర్ సంగం సభ్యులు అదే గ్రామానికి చెందిన కుంభం రఘుమారెడ్డిని స్థలం ఇవ్వాలని కోరగా శివన్నగూడ గ్రామ చివర ఇందుర్తి రెవెన్యూ పరిధిలో రెండు ఎకరాల పైచిలుకు భూమిని రఘుమా రెడ్డి భూదానం చేశారు. కాంగ్రెస్ నాయకులు దివంగత మంత్రి పాల్వాయి గోవర్ధన్ రెడ్డి నిధుల నుండి 1996 సంవత్సరంలో అంబేద్కర్ భవ నాన్ని మంజూరు చేశారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ హోమ్ మినిస్టర్ ఆళ్లపాటి ధర్మారావు ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన సమయంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని నారాయణరావు తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అప్పుడు భూమి పూజకు నోచుకున్న భవనం గోడలు మాత్రమే నిర్మితమై మధ్యలోనే ఆగిపోయింది. రాష్ట్రం మారింది ప్రభుత్వాలు మారాయి నేటికీ నిర్మాణం పూర్తి కాకుండా పట్టించుకునే వారు లేక దట్టమైన కంప చెట్లు ఏనుకొని



నిర్మానుషంగా ఉన్నది. ఆగిపోయిన అంబేద్కర్ భవనాన్ని నిర్మించే చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## వైభవంగా శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

### స్వామివారికి 108 కళశములతో క్షీరాభిషేకం



**భూదాన్ పోచంపల్లి, మేజర్ న్యూస్:** భూదాన్ పోచంపల్లి మండల పరిధిలోని కనుముక్కుల గ్రామంలోని శ్రీశ్రీశ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారము దేవాలయ నిర్వాహకులు ,చైర్మన్ కోట పుష్పలత మల్లారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి 108కలశములతో క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు గట్టు పాండురంగారెడ్డి, అధ్యక్షులు పడమటి మహిపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు కోట అజిత్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నూకల లింగస్వామి యాదవ్, సభ్యులు రంగ మధు ,కోట భూపాల్ రెడ్డి, కోట సత్తిరెడ్డి, కట్కూరి శ్రీనివాస్ గౌడ్, వేణు గోపాల చారి ,మదన్మోహన్ రెడ్డి, రంగారెడ్డి ,నవీన్, తిరుమలేష్ యాదవ్, రాములు ,పారిజాత ,భార్గవి, ఐశ్వర్య ,మంజుల, మాధవి , దేవాలయ ప్రధాన అర్చకులు వంశీ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం..!



**మర్రిగూడ, మేజర్ న్యూస్:** ఇందుర్తి గ్రామానికి చెందిన నామ రమేష్ ఇటీవల అకాల మరణం చెందారు. అదే గ్రామానికి చెందిన బాల్య మిత్రుడు ఏరుకొండ అబ్బయ్య తోటి స్నేహితులతో కలిసి 42000 వేల రూపాయలు మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జంగయ్య, యజ్ఞచారి,రాజు,అబ్బయ్య, రఘు, వినోద, ఉషారాణి,రమ్య, రజిని,రమేష్,శ్రీశైలం,పాపచారి, యాదమ్మ తదితరులు ఉన్నారు.

## నిరుపయోగంగా కంపోస్ట్ షెడ్లు!



**కనగల్, మేజర్ న్యూస్:** మండలంలోని ఆయా గ్రామపంచాయతీలో సేకరించిన చెత్త, వ్యర్థాలను సేంద్రియ ఎరువులుగా తయారు చేసేందుకు డంపింగ్ యార్డ్ లో కంపోస్ట్ షెడ్లు నిర్మించారు. కానీ కంపోస్టేట్లో సేంద్రియ ఎరువులు తయారు చేయడం లేదు. కనగల్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కాలనీలో సేకరించిన చెత్త ఇతర వ్యర్థాలను వేయడం కోసం కంపోస్ట్ చెట్లను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామ పంచాయతీల సేకరించిన చెత్తాచెదారాన్ని చెట్లకు తరలిస్తూ ఉన్నారు. కానీ వాటిని ఉపయోగము లోకి తేవడంలో అధికారులు ప్రయత్నంలో విఫలం అవడం చూస్తున్నాం. కంపోస్ట్ చెట్లు ఏర్పాటు చేయడానికి ముఖ్య కారణం సేకరించిన వ్యర్థాలను సేంద్రీయ ఎరువుల తయారీ, వనరుల సేకరణ కోసం 33 గ్రామపంచాయతీలు కంపోస్టర్లను ఏర్పాటు చేశారు. ఈ షెడ్యూల్లో పాత చెప్పులు, పాత దుస్తులు, బ్యాగులు, ప్లాస్టిక్ సీసాలు ఇతర వ్యర్థాలు పేపర్ అట్టాలు కంపోస్టు వేర్వేరుగా వేయడం కోసం ప్రత్యేకంగా సంపులు నిర్మించారు. వేరు చేసిన వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. అయితే మండలంలోని కాలనీలో ప్రజల నుంచి సేకరించి వాహనాల్లో తెచ్చిన చెత్త వ్యర్థాలను తగలబెడుతున్నారు. దీంతో అటువైపు నుంచి వెళ్తున్న రైతులు పొగతో , కంపు కొడుతున్న వ్యర్థాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సేంద్రియ ఎరువులు తయారు చేయకపోవడంతో అన్ని గ్రామ పంచాయతీలో షెడ్లు బోర్డులకు మాత్రమే పరిమితమై నిరుపేగంగా దర్శనమిస్తున్నాయి.

**పొగ మంటలతో ఆందోళన...**

డంపింగ్ యార్డ్ లో ప్రతిరోజు చెత్తకు నిప్పు పెట్టడంతో పొగ ధూళితో పంట పొలాలు దెబ్బతింటున్నాయి. పశువుల కోసం దాచుకున్న పశు గ్రాసం సైతం కాలి బూడిద అవుతుందని రైతులు వాపోతున్నారు. రైతులు ఈ దారి గుండా వెళుతున్నప్పుడు వారికి ఎదురవుతున్న ఇబ్బందులు లతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లోకి మంటలు వ్యాపించి వ్యవసాయ భూముల్లో ఉన్న పైప్ లైన్లు డ్రిప్పులు కాలిపోయిన సంఘటనలు అనేకంగా ఉన్నాయి. ఆయా గ్రామాల్లో రైతులు తమ వ్యవసాయ భూముల్లో దగ్గరకు వెళ్లాలంటే ఒక కారణంగా ఊపిరి దిగ కట్టుకొని వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపేదంగా ఉన్న సేంద్రియ ఎరువుల తయారీ షెడ్లు ఉపయోగములకు తేవాలని రైతులు, ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

**ఎరువుల తయారీని త్వరలో ప్రారంభిస్తాం:ఎంపీడీవో వేద రక్షిత..**

ప్రస్తుతం మండలంలోని 33 గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసిన డంపింగ్ యార్డ్ లకు సంబంధించిన చెత్త చెదారమును, ఎరువుల తయారీకి ఉపయోగిస్తామన్నారు. ఇప్పటికే ఎక్కడైతే నిరుపయోగంగా ఉన్న షెడ్లను సందర్శించి వాటికి కావలసినటువంటి మూలధన వస్తువులను తయారు చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు.



## గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థికి అభినందనలు




**భూదాన్ పోచంపల్లి మేజర్ న్యూస్:** ఇటీవల గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన సీఎం కప్ లో అండర్ 17 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన జడ్పిహెచ్ఎస్ బాలుర పాఠశాల పూర్వ విద్యార్థి మండల పరిధిలోని పెద్ద రావులపల్లి గ్రామానికి చెందిన తప్పక పవన్ ని బుధవారం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిష్టయ్య,ఉపాధ్యాయుల సిరికొండ నరసింహ మరియు ఉపాధ్యాయులు అభినందించి సన్మానించారు.

## జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ ని కలిసిన పుట్టగూడెం సర్పంచ్



రాజపేట,మేజర్ న్యూస్:యాదగిరిగుట్ట మండలం పరిధిలోని మల్లాపూర్ గ్రామ శివారులో ఉన్న దేవ నాయకుల మర్రి దేవస్థానంలో సద్గురు శ్రీ సేవాలాల్ మహరాజ్ 287వ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా ఘనంగా నిర్వహించింది.ఈ కార్యక్రమానికి జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్‌నాయక్ ముఖ్య అతిథిగాహాజరయ్యారు.ఈ సందర్భం గా పుట్టగూడెం సర్పంచ్ రాజీ నాయక్ చౌహాన్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాజపేట మండల ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు చందు నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జితేందర్ నాయక్ పాల్గొన్నారు.

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఆందోళనలు



**చిట్యాల,మేజర్ న్యూస్:**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరశిస్తూ మార్చి 1 నుండి 20 వ తేదీ వరకు సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు రూపొందించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ తెలిపారు.చిట్యాల మండల కేంద్రంలో స్థానిక కా, మేకల లింగయ్య స్మారక భవనంలో బుధవారం నాడు జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.మండలంలోని వివిధ గ్రామాల లో నెలకొన్న సమస్యలపై సిపిఎం మండల బృందం అధ్యయనం చేసి ఆందోళన కార్యక్రమాలు రూపొందించనున్నట్లు తెలిపారు.అరూరి శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అవిశెట్టి శంకరయ్య,జిట్ట సరోజ, మండల నాయకులు బొబ్బిలి సుధాకర్ రెడ్డి, శీలా రాజయ్య, ఐతరాజు నర్సింహ,లదే రాములు, కల్లూరి కుమార స్వామి,కందగట్ల గణేష్, ఐతరాజు యాదయ్య, గుడిసె లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం



**భూదాన్ పోచంపల్లి, మేజర్ న్యూస్:** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారము ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాల లో పరీక్ష కేంద్రాలను నిర్వహించగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 187 మంది విద్యార్థులకు గాను 185 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ,ఆదర్శ పాఠశాల పరీక్షా కేంద్రంలో 201 మంది విద్యార్థులకు గాను 200 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా జరిగాయని చీఫ్ సూపరింటెండెంట్ సి.తులసి తెలిపారు.

# రోడ్డుభద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

- ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలి
- రోడ్డు ప్రమాదాల నివారణకై డ్రైవర్లు డిఫెన్సివ్ డ్రైవింగ్ చేయాలి
- ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరాలనేది అరైవ్ అలైవ్ ఉద్దేశ్యం
- - పోలీస్ సామాజిక సేవగా డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షల శిబిరం.
-ఉచిత కంటి వైద్య శిబిరం సద్వినియోగం చేసుకున్న 500 లకు పైగా వివిధ వాహనాల డ్రైవర్లు.
-పరీక్షల అనంతరం అవసరమైన వారికి మందులు, కంటి అద్దాల ఉచిత పంపిణీ
- అరైవ్ అలైవ్ భద్రత మహా ఉద్యమం నిరంతరంగా కొనసాగుతుంది:సూర్యాపేట జిల్లా ఎస్పీకె.నరసింహ



**హుజూర్ నగర్ రూరల్, మేజర్ న్యూస్** :రోడ్డు ప్రమాదాల నివారణ,గమ్యం చేరడం ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర పోలీసు డిజిపి ప్రారంభించిన 'ఆరవ్ అలైవ్' మహా ఉద్యమం కార్యక్రమం 2వ విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా హుజూర్‌నగర్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో టౌన్‌హాల్ నందు ఏర్పాటు చేసిన వివిధ రకాల వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని బుధవారం రోజున జిల్లా ఎస్పి నరసింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ డ్రైవర్ వృత్తి చాలా కష్టతరమైన పనిని ఈ వృత్తినిఎంచుకొని నిర్విరామంగా కష్టపడుతూ డ్రైవర్లు ఆరోగ్యాలనులెక్క చేయ లేకపోతున్నారని అన్నారు. డ్రైవింగ్ వృత్తిలో కంటిచూపు చాలా కీలకమై నదని డ్రైవర్ యొక్క కంటి చూపు బాగా ఉంటే వాహనాన్ని సమర్థవంతంగా నడపగలుగుతారని తెలిపారు.డ్రైవర్లకు వయస్సు పెరిగే కొద్ది కంటి చూపు మందగించడం జరుగుతుంది అలాంటి వారు కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకొని తగిన జాగ్రత్తలు పాటించాలి, కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలు సరిగ్గా గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని అన్నారు.చాలామంది డ్రైవర్లు కంటి చూపును అశ్రద్ధ చేస్తున్నారని ఉద్దేశంతో రాష్ట్ర డిజిపి ఇచ్చిన పిలుపు మేరకు ఆరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో సర్కిల్ పోలీసుల అధ్వర్యంలో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల వైద్య శిభిరం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమానికి స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, లైన్స్ క్లబ్ డాక్టర్లు, స్థానిక కంటిఆసుపత్రుల డాక్టర్ల సహకారంతో పెద్ద ఎత్తున కంటి పరీక్షలు నిర్వహించామని తెలిపారు.రోడ్డు భద్రత అంటే రోడ్డు పై ప్రయాణించే వాహనదారులు వాహనాలను జాగ్రత్తగా నడిపి ప్రమాదాలను నివారించడం. రోడ్డు భద్రత రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకము, ప్రతి వహనదారుడు డిఫెన్సివ్ డ్రైవింగ్ చేయాలి, రోడ్డు పై ఎడమ వైపున వాహనాన్ని నడపాలి, ఎక్కడపడితే అక్కడ అవహనాలు నిలపవద్దు, తప్పుడు మార్గంలో వాహనాలు నదిపే ప్రమాదాలు సంభవిస్తాయి అన్నారు. డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలి అంటూ. వాహనాలు నడిపేటప్పుడు వేగ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలను పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, కారులో సీట్ బెల్ట్ మరియు ద్విచక్ర వాహనంపై హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వినియోగించరాదని, అలసట లేదా నిద్రలేమి ఉన్నప్పుడు వాహనం నడపవద్దని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన లైసెన్స్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ వంటి పత్రాలు కలిగి ఉండాలి, బ్రేకులు, లైట్లు, టైర్లు సరిగా ఉన్నాయో లేదో నిరంతరం పరిశీలించాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న జాగ్రత్త ప్రాణాలను కాపాడగలదని ఎస్పీ పేర్కొన్నారు. శిబిరం ద్వారా 500 వందలకు పైగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామని, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ చరమంద రాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, పోలీస్ సర్కిల్ పరిధి లోని ఎస్సైలు ఎస్ఐ మోహన్ బాబు, నరేష్, ఎస్ఐ కోటేష్, హుజూర్నగర్ ఏరియా హాస్పటల్ సూపరింటెండెంట్ డా.ప్రవీణ్ కుమార్, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ జిలానీ, డాక్టర్లు నాగేందర్, కంటి హాస్పటల్ డాక్టర్ ప్రవళిక, లైయన్స్ క్లబ్ డాక్టర్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది,డ్రైవర్లు పాల్గొన్నారు.

## రిక్వెస్ట్ బస్ స్టాప్ సూచిక ఏర్పాటు



**నేరేడుచర్ల, మేజర్ న్యూస్:** సాయం అందించేందుకు ఎల్లవేళలా నేనున్నా అంటూ ప్రతి సందర్భంలోనూ సాయం అవసరం ఉన్న ప్రతి చోట తనవంతు సహకారం అందిస్తూ వస్తున్నారు జిన్నా రెడ్డి శ్రీనివాస్ రెడ్డి. ప్రజాసేవలో నేనున్నానంటూ ఇటు రాజకీయంగా, వ్యక్తిగతంగా సేవా కార్యక్రమాలు చేస్తూ నియోజకవర్గంలో ప్రత్యేక స్థానాన్ని పొందుతున్నారు నేరేడుచర్ల మండల కేంద్రంలో చింతబండ వద్ద రిక్వెస్ట్ బస్ స్టాప్ లేక అక్కడి ప్రయాణికులకు బస్సు నిలుపుదల చేయక అసౌకర్యంగా ఉండడంతో, అక్కడివారు తన దృష్టికి తీసుకురాగా ఆర్టీసీ ఆర్ఎం తో మాట్లాడి రిక్వెస్ట్ బస్ స్టాప్ సూచికను ఏర్పాటు చేసి వారి సమస్యను తీర్చారు.

## ప్రారంభమైన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు



**చింతపల్లి, మేజర్ న్యూస్:** చింతపల్లి మండల కేంద్రంలోని అలుకా జైహింద్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి.మొదటిరోజు 171 మంది విద్యార్థులకు గాను ముగ్గురు ఆబ్సెంట్ అయినట్లు 168 మంది పరీక్షలు రాసినట్లు ఇన్చార్జి సూపరెండెంట్ కే .వాసురాం తెలిపారు. చింతపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూలు, కస్తూర్బా, అలుక జైహింద్ రెడ్డి ప్రభుత్వ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. చింతపల్లి ఎస్సై ముత్యాల.రామ్మూర్తి ఆధ్వర్యంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. డివో. శ్రీధర్, ఎగ్జామినేషన్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది సైదయ్య తదితరులు ఉన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి
## మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు



**భూధాన్ పోచంపల్లి, మేజర్ న్యూస్:** భూధాన్ పోచంపల్లి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు అన్నా రు .బుధవారము పోచంపల్లి పురపాలక కార్యాలయానికి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సిబ్బంది కలిసి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లుని మర్యాదపూర్వకంగాకలిసి శాలువాలతో సన్మానించారు. అనం తరం ఆయన వారితో సమావేశమై మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి వైద్య సిబ్బంది సహకరించాలని ఆయన వారిని కోరారు. ప్రతినిత్యం బీపీ, షుగర్ తో పాటు జనరల్ వ్యాధులకు కోసం వచ్చే వారికోసం ఎల్లప్పుడు మందులను సిద్ధంగా ఉంచాలని అన్నారు. నాలుగు గంటల తర్వాత వైద్య సిబ్బంది తమ డ్యూటీ అయిపోయిన తర్వాత కూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర చికిత్స కోసం వచ్చే రోగులను పట్టించుకోని వారికి ప్రాథమిక చికిత్సను అందించి సరైన దిశ, నిర్దేశం చేసే విధంగా సిబ్బందిని నియమించాలని ఆయన వారిని కోరారు. కాగా15,000 జనాభా గల పోచంపల్లి మున్సిపల్ ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గా ఏర్పాటు చేసే విధంగా ఎమ్మెల్యే సహకారంతో సంబంధిత మంత్రిని త్వర లోనే కలిసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు. పట్టణ ప్రజలను ఆరోగ్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రిలో కూడా 24 గంటలు వైద్య లు అందుబాటులో ఉండే విధంగా వైద్య సదుపాయాలు అందించే విధంగా వారితో కూడ త్వరలోనే సమావేశం ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దేవరాయ కుమార్,మండల వైద్యాధికారిని శ్రీవాణి, లక్ష్మణ్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ





**సూర్యాపేట టౌన్, మేజర్ న్యూస్:** సూర్యాపేటలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష కేంద్రాలను బుధవారం సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. బుధవారం నుండి ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సంబంధించి సూర్యాపేట జిల్లా కేంద్రంలో నారాయణ జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కలశాల పరీక్షా కేంద్రాలను ఎస్పి నరసింహ ఐపీఎస్ పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లు, పరీక్షా సరళిని పరిశీలించి విధులు నిర్వహిస్తున్న ఎగ్జామినేషన్ సెంటర్ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి సూచనలు సలహాలు అందించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నామని తెలిపినారు. పటిష్ట పోలీసు బందోబస్తు నడుమ ప్రశాంతంగా పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. నిషేధ ఆజ్ఞలు ఉన్నందున పరీక్ష కేంద్ర పరిసరాల్లో లౌడ్ స్పీకర్లు, మైకులు, వాహన హరన్ లు ఉపయోగించరాదని కోరారు. జిరాక్స్ సెంటర్స్, ఇంటర్నెట్ కేంద్రాలు మూసివేయాలనిసూచించారు. విద్యార్థులు ఒత్తిడికి గురవకుండా పరీక్షలురాసి మంచి ఫలితాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామా రావు, ఎస్ఐలు శివ తేజ, మహేంద్రనాథ్, ఎగ్జామినేషన్ సిబ్బంది ఉన్నారు.

## ఆట స్థలం లేదిక్కడ..?
## ప్రభుత్వ పాఠశాల కానీ.. కనిపించని క్రీడా స్థలం




**సూర్యాపేట టౌన్, మేజర్ న్యూస్:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో 38వ వార్డు ఎమ్మార్వో ఆఫీస్ సమీపంలో ప్రభుత్వ నూతన ఉన్నత(జి జే ఎం)పాఠశాలలో ఆడుకోవడానికి ఆటస్థలం లేక పాఠశాల దగ్గర నుండి 5 కిలో మీటర్ల దూరం వెళ్లి ఆడుకోవలసిన పరిస్థితి ఆ స్కూలు పిల్లలకు ఏర్పడింది. ఆ పాఠశాలలో 300 నుండి 400 మంది విద్యార్థులు ఉంటారు. ప్రభుత్వ పాఠశాల అంటేనే చదువుతోపాటు ఆటలు ఆటస్థలం ఉంటాయి కానీ ఇక్కడ అవేమి కనిపించవు కేవలం చదువు మాత్రమే ఉంటుంది.స్కూలుకు సంబంధించిన ఉపాధ్యాయులు ఎన్నో సార్లు ఆటస్థలం కోసం అప్లికేషన్లు పెట్టుకున్న వారికి చుక్కెదురవుతుంది. సూర్యాపేట జిల్లా కలెక్టర్ దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి పిల్లలకు దగ్గర్లోనే ఆట స్థలం కేటాయించాలని అన్నారు. లేకపోతే ఎవరైనా దాతలు వచ్చి సహకరిస్తారా వేచి చూడవలసిందే.ఏది ఏమైనా ఆ స్కూల్ పిల్లలు ఒకటే కోరుకుంటున్నారు మాకు దగ్గరలోనే ఒక ఆటస్థలం కేటాయించాలని కలెక్టర్ ను కోరుతున్నారు.